


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
బుధవారం
18-03-2026
పేజీలు: 02

## దేశవ్యాప్తంగా 17% క్షీణించిన ఎల్పీజీ వినియోగం



మార్చి మొదటి వారంలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ వినియోగం 17% తగ్గిందని లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది. దీనికి పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులే కారణమని భావిస్తున్నారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఈ ఏడాది వినియోగం 1.147 మిలియన్ టన్నులకు పడిపోయింది. మరోవైపు, పెట్రోల్, డీజిల్ అమ్మకాలు పెరిగాయి.

# మూసీ ప్రక్షాళనకు కాదు..
# లక్షన్నర కోట్ల దోపిడీకే మేం వ్యతిరేకం

### అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకతా లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున.. దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ రోజు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ రోజు అసెంబ్లీలో మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని కీలక అంశాలపై కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీశారు. ముఖ్యంగా డిపిఆర్ (DPR) తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.





ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ఆయన ప్రశ్నించారు. "ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు?, ఎంత భూసేకరణ జరుగుతుంది?, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు? అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లను కూల్చివేసే పరిస్థితి ఉందనీ, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని కేటీఆర్ అన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారనీ, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. "మూసీ ప్రాజెక్ట్ పేరుతో ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదు, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

### గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నేతల నిరసన

గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు.. అక్కడి నుంచి కాలినడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. 8 లక్షల ఎకరాల్లో రైతులు మక్కలను పండించారని, మద్దతు ధర లేకపోవడంతో పాటు వర్షాల కారణంగా అన్నదాతలు నష్టపోతున్నారని తెలిపారు. 25 శాతం పంట.. దళారుల చేతికి వెళ్లిందని అన్నారు. పంటల బీమా అమలు చేయడం లేదని విమర్శించారు. వడగండ్ల వానతో రైతులు నష్టపోయారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదని... వెంటనే ఇవ్వాలన్నారు. రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్ వెంటనే ప్రభుత్వం చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.



## అమెరికాను విడిచి వెళ్తే ఒక్కొక్కరికీ రూ. 2.40 లక్షలు
## డొనాల్డ్ ట్రంప్

అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులను స్వచ్ఛందంగా తమ దేశాలకు పంపేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 'ఎగ్జిట్ బోనస్' పథకాన్ని ప్రకటించింది. దీని ప్రకారం, తమంతట తాముగా అమెరికాను వదిలి వెళ్లే వారికి 2,600 డాలర్లు (సుమారు రూ. 2,40,329) నగదు ప్రోత్సాహకం, ఉచిత విమాన ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. 'సీబీపీ హోమ్' యాప్ ద్వారా సమాచారం అందిస్తే, వారి పేర్లను బలవంతపు బహిష్కరణ జాబితా నుంచి తొలగించి, అరెస్టుల నుంచి తప్పించే అవకాశం ఉంది.



## తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2029లోనే
## సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2029లోనే జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం 2028 డిసెంబర్‌లో జరగాల్సిన ఎన్నికలు, జమిలీ ఎన్నికల నేపథ్యంలో నాలుగు, ఐదు నెలలు వాయిదా పడి 2029లో కేంద్రంతో పాటు జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈసారి తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల గ్యాప్ ఉండదని, ఒకేసారి జరిగేలా కేంద్రం యోచిస్తోందని సీఎం వ్యాఖ్యానించారు.



## ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణతో తెలంగాణలో గుడ్ల ధరలు పతనం

తెలంగాణలో కోడిగుడ్ల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణ కారణంగా ఎగుమతులకు అంతరాయం కలగడమే దీనికి ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో రూ. 7.50 నుంచి రూ. 8 వరకు ఉన్న రిటైల్ ధర ఇప్పుడు రూ. 5కు పడిపోయింది. హోల్‌సేల్ మార్కెట్‌లో రూ. 4.50 నుంచి రూ. 4కు తగ్గింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి. భారతదేశం సాధారణంగా గల్ఫ్ దేశాలకు రోజుకు సుమారు 75 లక్షల గుడ్లను ఎగుమతి చేస్తుంది.

## బిడ్డ వయసు ఎంతైనా సరే.. దత్తత తీసుకుంటే
# తల్లికి ప్రసూతి సెలవు ఇవ్వాల్సిందే
### సుప్రీంకోర్టు కీలక తీర్పు

బిడ్డను 9 నెలలు మోసి కన్నా.. దత్తత తీసుకుని పెంచుతున్నా.. తల్లికి ఉండే మమకారం ఒకటే. కానీ చట్టంలోని కొన్ని నిబంధనలు మాత్రం దత్తత తీసుకున్న తల్లుల పట్ల వివక్ష చూపుతున్నాయి. అయితే ఈ వివక్షకు చరమగీతం పాడుతూనే సుప్రీం కోర్టు మంగళవారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. "దత్తత తీసుకోవడం అనేది పునరుత్పత్తి స్వేచ్ఛలో భాగం" అని పేర్కొంటూ.. దత్తత తీసుకున్న తల్లులకు లభించే ప్రసూతి సెలవులపై ఉన్న పరిమితులను కొట్టివేసింది. ముఖ్యంగా మూడు నెలల లోపు చిన్నారులను దత్తత తీసుకుంటేనే సెలవులు ఇవ్వాలన్న నిర్ణయాన్ని కొట్టేవేస్తూ.. వయసుతో సంబంధం లేకుండా తల్లులు అందరికీ 12 వారాలా ప్రసూతి సెలువులు ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న 2020 నిబంధనల సెక్షన్ 60(4) ప్రకారం.. కేవలం మూడు నెలల కన్నా తక్కువ వయసున్న బిడ్డను దత్తత తీసుకుంటేనే తల్లికి 12 వారాల ప్రసూతి సెలవు లభించేది. అంతకంటే ఎక్కువ వయసున్న పిల్లలను దత్తత తీసుకుంటే ఈ సౌకర్యం ఉండేది కాదు. కానీ ఈ నిబంధనను సవాల్ చేస్తూ న్యాయవాది హంసానందిని నండూరి



దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. "దత్తత తీసుకున్న బిడ్డ వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి తల్లికి 12 వారాల ప్రసూతి సెలవు లభించాలి" అని ధర్మాసనం స్పష్టం చేసింది. మూడు నెలల నిబంధన రాజ్యాంగంలోని అధికరణ 14 (సమానత్వపు హక్కు), అధికరణ 21 (జీవించే హక్కు)లను ఉల్లంఘించడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

## హీరోలు భయపడుతున్నారు


బాలీవుడ్‌లో తనదైన మాటలతో పాటు బలమైన పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న నటి తాప్సీ పన్ను తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సినీ పరిశ్రమలో ఉన్న పురుషాధిక్యతపై ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు మళ్లీ చర్చకు దారితీస్తున్నాయి.తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ, కథానాయికలకు ఎక్కువ ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించేందుకు చాలా మంది హీరోలు వెనకడుగు వేస్తున్నారని వెల్లడించారు. ముఖ్యంగా తాను ఒక సినిమాలో డబుల్ రోల్ చేస్తున్న సమయంలో జరిగిన ఒక అనుభవాన్ని ఆమె పంచుకున్నారు.



## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు



రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు. ఇవాళ ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు. రాజ్యసభలో సీనియర్ సభ్యులుగా ఉన్న మాజీ ప్రధాని దేవగౌడ, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే, ఎన్సీపీ నేత శరద్ పవార్‌పై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఆ ముగ్గురూ రాజకీయాల్లో మహాయోధులన్నారు. పార్లమెంట్ కోసం వారి సగం కన్నా ఎక్కువ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వారు సభలకు హాజరవుతున్న తీరు, వారిలో అంకితభావం అసాధారణమైందన్నారు. కొత్తగా ఎంపికైన ఎంపీలు వారి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని ఆశించారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు.




## 'డ్యూన్: పార్ట్ త్రీ' టీజర్ విడుదల

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'డ్యూన్: పార్ట్ త్రీ' అధికారిక టీజర్ ట్రైలర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. దర్శకుడు డెనిస్ విల్లెనూవ్ తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రం ఫ్రాంక్ హెర్బర్ట్ రాసిన 'డ్యూన్ మెస్సయ్య' నవల ఆధారంగా రాబోతుంది. ఈ చిత్రంలో పాల్ అట్రిడెస్ ప్రయాణం రెండో భాగం ముగిసిన చోటు నుండే ప్రారంభం కాబోతుండగా.. చక్రవర్తిగా బాధ్యతలు చేపట్టిన పాల్ (తిమోతీ చాలమెట్) తన అధికారాన్ని ఎలా నిలబెట్టుకుంటాడు, విశ్వవ్యాప్తంగా తలెత్తే భీకర యుద్ధాలను ఎలా ఎదుర్కొంటాడు అనే ఆసక్తికర అంశాలతో ఈ సినిమా రూపొందుతోంది. టీజర్‌లో చూపించిన విజువల్స్ అత్యద్భుతంగా ఉండటమే కాకుండా, అరాకిస్ గ్రహంపై జరిగే యుద్ధ సన్నివేశాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

02 EVENING EDITION
బుధవారం | 18 మార్చి 2025
www.suryaa.com 4PM
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు షాక్



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో Iranలో ఉన్న భారతీయుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో Tehranలోని భారతీయ రాయబార కార్యాలయం అక్కడ చదువుకుంటున్న భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. అలాగే అవసరమైతే సరిహద్దులు దాటి ఇతర దేశాల ద్వారా స్వదేశానికి వెళ్లాలని సూచించింది. అయితే ముందస్తు సమాచారం ఇవ్వకుండా లేదా రాయబార కార్యాలయంతో సమన్వయం లేకుండా ఎవరూ కూడా సరిహద్దు దాటకూడదని స్పష్టం చేసింది.రాయబార కార్యాలయం సహకారం లేకుండా సరిహద్దు దాటి దేశం విడిచి వెళ్లే ప్రయత్నం చేస్తే ఇమిగ్రేషన్ సంబంధిత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. కొన్ని సందర్భాల్లో ఒకసారి దేశం దాటిన తర్వాత కూడా తాము సహాయం చేయలేని పరిస్థితులు రావచ్చని తెలిపింది. అందుకే ఇరాన్‌లో ఉన్న భారతీయులు తప్పనిసరిగా రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపి వారి సూచనలు పాటించాలని సూచించింది. ఇదిలా ఉండగా, Iran నుంచి ఇప్పటివరకు 550 మంది భారతీయులు Armeniaకు చేరుకున్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి Randhir Jaiswal తెలిపారు. వీరిలో 284 మంది పర్యాటకులు ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మరో 90 మంది భారతీయులు Azerbaijanకు వెళ్లినట్లు వెల్లడించారు.యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో Strait of Hormuzను ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆ మార్గంలో నౌకల రాకపోకలు సురక్షితంగా కొనసాగేందుకు ప్రపంచ దేశాలు ముందుకు రావాలని Donald Trump ఇటీవల పిలుపునిచ్చారు. అయితే ఈ అంశంపై అమెరికా–భారత్ మధ్య ఇప్పటివరకు ఎలాంటి అధికారిక చర్చలు జరగలేదని రణ్ధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు.



## ఐసీసీ ర్యాంకులు.. టాప్-5 వన్డే బ్యాటర్లలో భారత్ నుంచి ముగ్గురు

ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. కివీస్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానంలో నిలవగా, భారత్ నుంచి విరాట్ కోహ్లీ (2వ), రోహిత్ శర్మ (4వ), శుభ్‌మన్ గిల్ (5వ) స్థానాల్లో నిలిచి టాప్-5లో స్థానం సంపాదించారు. బౌలింగ్ విభాగంలో కుల్‌దీప్ యాదవ్ 9వ ర్యాంకు సాధించారు. టీ20 ప్రపంచ కప్ తర్వాత భారత్ వన్డేలు ఆడనప్పటికీ, ఈ ర్యాంకింగ్స్ ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

## తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు: హరీశ్ రావు



రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. మొక్కజొన్నలు కోతకు వచ్చినా ప్రభుత్వం ఎందుకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇవాళ తెలంగాణ అసెంబ్లీ వద్ద హరీశ్ రావు మాట్లాడారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,400 ఉంటే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక రూ.1,600, రూ.1,700కే రైతులు పంటను అమ్ముకుమంటున్నారని అన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ ల మధ్య మాటల తూటాలు పేలాయి. సభతో పాటు, సభ తర్వాత బైట కూడా మీడియా సమావేశల్లో నేతలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. ఇక తాజాగా.. మరోసారి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మొక్కజొన్న కంకుల్ని పట్టుకుని మరీ అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడున్న మార్షల్స్ వీరిని అడ్డుకున్నారు. తోపులాట జరిగింది. రైతుల గురించి మాట్లాడకూడదా..?. అంటూ నేతలు మండిపడ్డారు. మొక్కజొన్న కంకుల్ని అసెంబ్లీలోకి తీసుకెళ్తే తప్పేంటని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని, మద్దతు ధర చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల రూ.1600,1700 మొక్క జొన్న అమ్ముకుని రైతులు నష్టపోతున్నారన్నారు. మరో వైపు హరీష్ రావు మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఎందుకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం లేదని ఏకిపారేశారు. రెండు రోజులుగా పడుతున్న వడగళ్ల వర్షం వల్ల నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చి వెంటనే ఆదుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.



## మసీదు ఇమామ్, మౌజన్ లకు రంజాన్ తోఫా పంపిణీ

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బాపట్ల శాసనసభ్యులు, వేగేశన ఫౌండేషన్ చైర్మన్ వేగేశన నరేంద్ర వర్మ బుధవారం బాపట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'రంజాన్ తోఫా' ను పంపిణీ చేశారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలోని వివిధ మసీదులలో నిరంతరం సేవలు అందిస్తున్న ఇమామ్, మౌజన్లకు ఈ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం క్రమశిక్షణ, త్యాగం, దాతృత్వానికి నిదర్శనమని, సమాజంలో శాంతి, ఆధ్యాత్మికతను పెంపొందించడంలో ఇమామ్, మౌజన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు.



## బెంగళూరులో కోహ్లీ

ఐపీఎల్ 19వ సీజన్ కోసం టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ బెంగళూరు చేరుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేసేందుకు నగరానికి విచ్చేశాడు. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీలో టైటిల్‌ను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ఆర్సీబీ బరిలోకి దిగుతోంది. కోహ్లీ రాకను తెలియజేస్తూ ఆర్సీబీ తమ సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వీడియోను పంచుకుంది. విమానాశ్రయం నుంచి కారులో వస్తున్న కోహ్లీ విజువల్స్‌కు కేజీఎఫ్ థీమ్ మ్యూజిక్‌ను జోడించి ఈ వీడియోను రూపొందించారు. ఇందులో ట్రాఫిక్ సిగ్నల్‌పై కోహ్లీ జెర్సీ నంబర్ 18 కనిపించడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. "అతను వస్తున్నాడని తెలుసుకోవడానికి మీరు అతన్ని చూడాల్సిన అవసరం లేదు. క్యాలెండర్ చూడండి.. సంకేతాలు కనిపిస్తాయి" అని ఆర్సీబీ క్యాప్షన్ ఇచ్చింది.

## మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసుపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ కేసులో అరెస్టైన వారిలో ఎనిమిది మందికి నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రిగా తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశామని అన్నారు. ఏపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు నిబంధనల మేరకు స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. 2028లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు రాబోవని జోస్యం చెప్పారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందుగానే వస్తే సంతోషిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతకుముందు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఇతర నాయకులతో కలిసి ఆయన అధిష్ఠానం పెద్దలతో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు పరిచయం చేశారు.

## మామ, భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన అల్లుడు!



హనుమకొండ జిల్లాలో ఘోరం జరిగింది. అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవదహనమై కనిపించారు. కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మృతులను రాజశేఖర్ (54), రాజశ్రీ (24)గా గుర్తించారు. కాగా, రాజశ్రీకి 2023లో ప్రవీణ్ అనే యువకుడితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు కూడా ఉన్నారు. అయితే కుటుంబ కలహాల కారణంగా ప్రవీణ్.. వారిద్దరి ఒంటిపై డీజిల్ పోసి నిప్పు పెట్టినట్లుగా అనుమానిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదుతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. వేలిముద్రలు, ఇతర ఆధారాలను పోలీసులు సేకరించారు. ఇక ప్రవీణ్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## తెలంగాణకు వర్షసూచన

హైదరాబాద్ వాతావరణశాఖ వర్షసూచన జారీ చేసింది. రాబోయే నాలుగు రోజుల పాటు వర్షాలు పడతాయని హెచ్చరించింది. కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, వికారాబాద్, గద్వాల్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడతాయని హెచ్చరించింది. గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక శంషాబాద్, చంద్రాయణగుట్ట, చార్మినార్, ఎల్బీ నగర్, సరూర్ నగర్, వనస్థలిపురం, బండ్లగూడ జాగీర్, కాటేదాన్, కార్వాన్, రాజేంద్రనగర్, బహదూరుపురా ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు పడతాయని హెచ్చరించింది. కాగా గడిచిన 24 గంటల్లో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, లక్డీకపూర్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షాల క్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. విద్యుత్ స్తంభాల వద్ద ఉండవద్దని, హోర్డింగ్స్, చెట్లు పడిపోయే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది.



## పాత ఫార్ములాపైనే బాలీవుడ్, టాలీవుడ్

చిత్ర పరిశ్రమలో కథల ఎంపిక కంటే బాక్సాఫీస్ వద్ద హిట్టయిన పాత ఫార్ములానే అనుసరిస్తున్నారని నటి అనన్య పాండే అభిప్రాయపడ్డారు. కరీనా కపూర్ ఖాన్‌తో ముఖాముఖిలో మాట్లాడుతూ, ఒక సినిమా విజయం సాధిస్తే, అదే తరహా కథలతో సినిమాలు తీయడం సృజనాత్మకతను దెబ్బతీస్తుందని, ప్రేక్షకులు విసిగిపోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాలీవుడ్‌లోని కాపీ సంస్కృతిపై ఆమె విమర్శలు చర్చనీయాంశమయ్యాయి. కళ్యాణి ప్రియదర్శన్ నటించిన `లోకా చాప్టర్ 1: చంద్ర` వంటి కొత్త పంథా సినిమాల అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. రేవతి, సుహాసిని, నయనతార వంటి నటీమణుల బాటలో నేటి తరం నటీమణులు కూడా కొత్త జానర్లను అన్వేషించాలని ఆమె కోరారు.